కథ

# అవనిజ

- రాంపా

**అవనిజను చూడాలి!**
**పరామర్శతో దగ్గరకు చేరాలి!**
**తనే మగ దిక్కు కావాలి!**
**గతి తప్పిన ఆలోచనలు మదిని తొలిచేస్తున్నాయి. తడబడుతున్న పాణి నీడ అవనిజకు సమీపంలో నిలిచింది. తను వచ్చిన అలికిడికి కూడా ఏ మాత్రం స్పందించ లేదు అవనిజ. తనతో మాటేం కలుపుతుందని! అక్కడే వున్న అవనిజ కూతురు ఏదో పుస్తకంలో పేజీ తిప్పింది కాని తన ఉనికిని గమనించినట్లు లేదు. తల్లికి ప్రతిబింబంలా వుంది!**

''ప్రమాదం ఎలా జరిగిందట'' ఎండిపోయిన పాణి గొంతు అసంకల్పితంగా శబ్దం చేసింది.

అసందర్భంగా వుంది తన ప్రశ్న.

కనురెప్ప వాల్చకుండా శూన్యానికి అంకితమైన అవనిజ లిప్తపాటు పాణిని చూసి లేచి లోపలికి వెళ్లింది. ముక్కంటి మూడోకంటి వెలుగు ఆ చూపులో వుంది. ఇక అక్కడ వుండడంలో వ్యర్థం అర్థమయింది పాణికి.

చేతులు వెనక కట్టుకుని అడుగులు బయటికి వేస్తున్నాడు పాణి.

''మీ కళ్లజోడు'' – తీసికెళ్లి యిచ్చింది అవనిజ కూతురు.

ఆ వంకతో అతను మళ్లీ రాకుండా ఆ పని చేశానని తల్లితో చెప్పింది తర్వాత.

***

అందమైన శిల్పానికి సజీవ రూపం అవనిజ. మంచి మనసనే సాహిత్యానికి తీయని గొంతు అవనిజ! ఆ గానాన్ని ఆస్వాదించే అవనిజ భర్త సుప్రజారామ్‌ని కురూపి అనలేం గాని తెలివితో అందంగా కనిపించే వాళ్లలో ఒకడని చెప్పగలం!

బాహ్యానికి ప్రాధాన్యం యిచ్చే కళ్ల సంస్కారాన్ని నటించడం కూడా మరచిపోయాయి.

ఉమ్మెత్త చెట్టు మీద సీతాకోక చిలుక వాలినట్లుంది!

ఎక్కడో ఏదో పొరపాటు జరిగి నీకీ అదృష్టం పట్టింది!

అసలామె భర్తగా నీవు తగవు!

ఎన్నో అసూయలు పదాలై పెదాలు దాటి సుప్రజారామ్ హృదయాన్ని తాకాయి!

మనసుకి ఏ గాయం తగిలినా చిరునవ్వుతో నయం చేసుకోవడం చిన్నప్పుడే అలవాటు చేసుకున్నాడు – సుప్రజారామ్.

పరిపక్వమైన ఆలోచన పెరిగి ఆ అవసరం కూడా లేకుండా చేసింది. మొహం మీద ఆభరణం గానే మిగిలింది సుప్రజారామ్ చిరునవ్వు!

అయితే అవనిజ అనుభవం అందుకు భిన్నంగా వుంది–

''నీ అంతంత మాత్రపు చదువుకు అంత హోదా డబ్బు వున్నవాడు దొరకడని అందాన్ని ఎరవేసి లాక్కున్నావు'' అంది గుర్తుకురాని పరిచయంతో వచ్చిన ధవళ అనే ఆవిడ – అని ఊరుకుంటే సరి పోయేది. అవనిజ ఏదోలే అని సర్దుకుపోయి వుండేది. ''అయినా నువ్వే తెలివగల దానివిలే – మొగుడి చాటుగా అందాల్ని ఆనందించడం పెద్ద పనేం కాదనుకో'' అంది ధవళ. ఖంగుతిన్న అవనిజ ఆవిడ చెంప ఛెళ్లు మనిపించింది. ''నీ జీవితంలో నా యింటి గడప తొక్కకు'' అని చెప్పి పంపించింది. ఆ ప్రస్తావన భర్త దగ్గర వచ్చినప్పుడు – ''చేయెందుకు చేసుకున్నావు'' సౌమ్యంగా అడిగాడు సుప్రజారామ్.

''ఆ చికిత్స ఆమెకు అవసరం అనిపించిందండీ'' అంది అవనిజ.

''ఆమె చెడు అని స్పష్టమయింది. నీవు ఏ జవాబు చెప్పకుండా ఆమెను చూస్తూ వున్నట్లయితే వాగీవాగీ వెళ్లిపోయేది. శాశ్వతంగా ఆమె నీ మనసు నుంచి చెరిగిపోయేది. అటువంటి వాళ్లు వాళ్లకు తెలియకుండానే మనకు మంచి చేస్తారు. నీవు చేసిన పనికి ప్రతి చర్య వుంటుంది. ఏం చేస్తుందా? ఏం చేస్తే ఏం చేయాలా అనే ఆలోచన నీకు పెద్ద పనై కూచుంటుంది. అదే లేదనుకో – మన మనసు మన మనసు మార్గంలోనే సజావుగా సాగుతుంది'' మృదువుగా చెప్పాడు సుప్రజారామ్.

భార్య కంటిలో తడి చూసి – దగ్గరకు తీసుకున్నాడు భర్త. తన వ్యక్తిత్వానికి సరైన దారి చూపించాడు భర్త!

భర్త హృదయం సాక్షిగా ఓ సంకల్పాన్ని మనసులో నింపుకుంది అవనిజ. చదివే తెలివి వుండి పరిస్థితులు కలిసి రాని తన దుస్థితి తన కూతురికి రాకూడదు! చదివించాలి!

***

పాణి పని చేస్తున్న ఆఫీసు మేనేజరు సుప్రజారామ్‌కి బాగా పరిచయం. ఆయన్ను కలవడానికి వచ్చినప్పుడు బయట కారులో వున్న అవనిజను చూశాడు పాణి! అవనిజ భర్త కంటే తను ఎంతో అందమైనవాడినని అంచనా వేసుకున్నాడు. అంతకంటే ఏం కావాలి యిటువంటి దురదృష్ట కరమైన భార్యకు అనుకున్నాడు. తన అందాన్ని అభినందించిన ఆడవాళ్లను గుర్తు చేసుకున్నాడు.

పాణిగ్రహణం చేయాల్సిందే అని మెదడు వాచింది.

మంచిని చెడు అనుసరించింది!

పాణికి ఎన్నో రోజులు పట్టలేదు. అవనిజ యిల్లు కనుక్కోడానికి!

***

తననుకున్న ప్రకారం సుప్రజారామ్‌కి దారిలో ఎదురయ్యాడు పాణి. ''నమస్తే సార్'' అన్నాడు. గుర్తుపట్టకపోతే తనెవరో చెప్పుకున్నాడు. ''మా అదృష్టం కొద్దీ మీ యింటి పక్కే మాకింత చోటు దొరికింది. భార్యాకూతురితో వుంటున్నాను. ఇక మీరు మా మేనేజరు గారితో ఏ పనున్నా నాకు చెప్పొచ్చు'' అన్నాడు. తాగొచ్చి భార్యను హీనంగా మాట్లాడే తను – కూతుర్ని అశ్రద్ధచేసే తను – అదోరక్షగా యిక్కడ ఉపయోగించుకోడానికి ఏ మాత్రం సిగ్గుపడ లేదు పాణి. మనసులో మాలిన్యం వున్నా గొంతులో వణుకుని కప్పి పుచ్చుకోడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తూ – పునాది వేశానని ఆనందపడ్డాడు పాణి!

ఆ ప్రయత్నాన్ని అప్రయత్నంగా చూసిన సుప్రజారామ్ నిస్పందనగా నవ్వాడంతే!

ఓ రోజు ఏదో వంకతో అవనిజ యింట్లో పాదం మోపాడు పాణి. ఆ రోజే అవనిజ భర్తకు చెప్పింది – యితను మళ్లీ మనింట్లో అడుగుపెట్టే అర్హతలేని వాడని. తన పరిశీలనే భార్య మాటల్లో విని సంతోషించాడు భర్త.

ఇంకోరోజు – ''సుప్రజారామ్ గారితో ఓ మాట చెప్పాలని వచ్చానండీ'' అని చొరవ చేసుకున్నాడు. ''బుద్ధి లేదా నీకు – ఆఫీసుకెళ్తున్న మా వారిని పలకరించి మరీ లోపలికొచ్చి మాట్లాడడానికి'' కోపంగా అంది అవనిజ.

''పలకరించకుండా రావాల్సింది కదా'' అన్నాడు చిలిపి చూపుతో

''గెటవుట్'' అరిచింది అవనిజ.

ఆ ధ్వనికి ధమనులు కదిలాయి పాణి గుండెల్లో!

అంతే మళ్లీ రాలేదు. రాలేక రాలేదు. సమయం కోసం అన్వేషణ మాత్రం వదిలి పెట్టలేదు. ఫలితంగా యిప్పుడొచ్చాడు విఫలంగా తిరిగి వెళ్లడానికి!

***

ప్రాణం వున్న మాంసం ముద్దలా పడున్నాడు భర్త మంచం మీద. ఫిజియోథెరఫి రోజూ చేయిస్తున్నది మిగతా సేవలు తనే చేస్తున్నది-

ఫస్ట్ యిన్ క్లాస్ బ్యాడ్జి పెట్టుకొచ్చిన కూతుర్ని ''నువు డాక్టరువై నన్ను సంతోష పెట్టాలమ్మా'' అని దగ్గరకు తీసుకుని ఆ బ్యాడ్జిని భర్త గుండెల మీద పెట్టింది అవనిజ. ఓ రాయికి దండ పెట్టినట్లే వుంది. రాయిలో దేవుడు! రాయిలా తన దేవుడు!

కూతురి చదువే తన ఉచ్ఛ్వాస నిస్వాస!

ఆ స్థితిలో వున్న తనని పలకరించడానికి వచ్చాడు పాణి.

***

దెబ్బలు కూడా పనిచేయని గొడ్డు పాణి!

అతని ప్రవర్తన బావుండలేదని యిల్లు ఖాళీ చేయించారని - భార్యకు విడాకులిచ్చి వెళ్లాడని. పాణి భార్య నీరవ కూతుర్ని ఏదో అనాధాశ్రయంలో చేర్పించి తను అదే యింట్లో వంట మనిషిగా వుందని - చెప్పింది పని మనిషి.

ధవళ అనే ఆవిడ వచ్చి పాణి ఎదురుగనే నీరవ మెళ్లో వున్న ఒక్క గొలుసు తీసుకుని వెళ్లిందన్న వార్తే తనను కలవర పెట్టింది. ధవళ తన చెంప మీద కొట్టిన అనుభూతి కలిగింది అవనిజకు!

***

ఆ స్థితిలో వున్న భర్త. కాలేజీకి వెళ్లే అమ్మాయి. అలజడి ఆందోళనతో తన ఒంటరి తనం! తనకో వ్యాపకం వుండాలి. ఆర్థికశక్తి సన్నగిల్లుతోంది. తనుగా వెళ్లి ఏదన్నా ఉద్యోగం ఆశిస్తే ఎదురయ్యే పరిస్థితి తన ఊహలో లేంది కాదు. తనకు తెలియకుండానే చేతి వేళ్లు ఒక దగ్గరగా వచ్చాయి. ఓ నిర్ణయానికి మద్దతు నిచ్చాయి. పేయింగ్ గెస్ట్ అకామిడేషన్ అమ్మాయిలకు మాత్రమే - పేపరు ప్రకటన యిచ్చింది. ఈ ఊళ్లోనే సొంత యిల్లు డబ్బు వున్న ఓ అమ్మాయి మొదటి గెస్టుగా వచ్చింది తోడుగా అమ్మమ్మతో. ఆవిడ పేరు శ్రీలలితాంబ. రచయిత్రి మంచి మాట కారి దూసుకెళ్లే మనస్తత్వం.

ఉద్యోగం వచ్చినంత తృప్తిగా వుంది అవనిజకు!

కూతురి చదువుకు ఏ అసౌకర్యం లేకుండా ఏర్పాటుచేసింది.

***

''అమ్మా, ఆవిడ వచ్చింది'' చెప్పింది అవనిజ కూతురు. వచ్చింది పాణి భార్య నీరవ.

''సరే రమ్మను'' అంది అవనిజ.

నీరవ - అవనిజ పాదాలు స్పర్శించింది! ఆ స్పర్శ అవనిజ మనసుని తాకింది. సాటి స్త్రీ తనూ ఓ ఆడపిల్ల తల్లే! ఏ సాయం కోరి వచ్చిందో ఏమో అనకుంది అవనిజ.

''ఇల్లు గలాయన మంచివాడే. యింటికొచ్చే వాళ్ల చూపులు భరించలేక పోతున్నాను - పని మనిషి మీ సంగతి చెప్పింది. మీరింత నీడిస్తే కన్నదాని కోసమైనా బతుకుతాను'' అంది నీరవ. చాలా తక్కువ మాట్లాడే నైజం. అవసరం ఆ రెండు మాటల్ని పలికించిందోమో అన్నట్లుగా వుంది.

అవనిజ అవాక్కుతో చూసింది! అవనిజను ఆర్తిగా చూస్తోంది నీరవ.

''నా చేతికిందో చేయి అవసరమే. కానీ. నీవిక్కడ వుండడం నాకు మంచిది కాదేమోనమ్మా'' అంది అవనిజ. ఎందుకో నీరవకు తెలుసు.

''నాన్నా అని పిలిచి తండ్రి ఉనికిని మరచిపో



యింది కూతురు! అతను మనిషి కాడు! ప్రేమించి పెళ్లి చేసుకున్నావు నీ ఖర్మ నీదే అన్నారు నా పుట్టింటి వాళ్లు. నా పిల్ల తండ్రి నీచుడని చెప్పుకోలేక చెప్పుకోడం లేదు. మారి మంచివాడయి వస్తాడన్న ఆశ లేదు. వచ్చాడంటే చెడు వచ్చినట్లే – అదే జరిగితే తన్నించి పంపించినా నేనేమనుకోనమ్మా'' అంది నీరవ.

ఒకరినొకరు 'అమ్మా' అనే సంబోధనలో తేడా విని నవ్వుకొంది. గదిలో చదువుకుంటున్న కూతురు!

నీరవ చెప్పడంలో వున్న స్వచ్ఛత – పాణి ఆవిడను భయపెట్టి యిక్కడకు పంపించి వుంటాడన్న అనుమానాన్ని తీసేసింది!

***

నీరవదీ ఒంటరి తనమే! పిల్లలదీ ఒంటరి తనమే! ఎంతో తేడా. అందరం ఆడవాళ్లం అన్నదొక్కటే ఒక్కటి. అన్ని ఒక్కట్లనూ ఒక్కటి చేసింది!

అప్పుడప్పుడూ పత్రికల్లో వచ్చిన ఆవిడ కథల్ని ఓ పుస్తకంగా తేవాలని – ముద్రితాల ముద్రణ పని మీద యిటుగా వచ్చానని – చెప్పింది లలితాంబ



వచ్చి. ఆవిడ రావడంలో నీరవని అధ్యయనం చేయడం వుందని కనిపిస్తూనే వుంది.

''మంచివాళ్లకు అంతా మంచి వాళ్లుగానే కనిపిస్తారమ్మా. మంచివాళ్ల పక్కన జేరి నిజనైజాలకు దారులు వెతికే వాళ్లుంటారని మనకు తెలిసే లోగా అనర్థాలు జరిగిపోతాయి. ఈ జాగ్రత్త నీకు తెలియందని కాదు. నా అనుభవం నీతో పంచుకుందామని అన్నాను. అన్యథా భావించకు''. బీరువాలో బట్టలు సర్దుతున్న అవనిజ దగ్గరకు వచ్చి ఆత్మీయంగా అన్నదామె. అవనిజ భర్త నేర్పిన చిరునవ్వుతో ఆమెను చూసింది.

''ఆ నవ్వుని ఎలా అర్థం చేసుకోవాలమ్మా – ఔననా, కాదనా, ఏదో చెబితేనేగా, మాటకు మాట వస్తేనే కదా మాటకు అందం'' అంది లలితాంబ అవనిజ కళ్లలోకి చూస్తూ.

''అనుభవాలు అనుభవించి చెప్పేవి కొన్ని. వివేకంతో ఊహకు అందేవి కొన్ని. నలుగురి మాటల్లో విని విశ్లేషణతో మిగిలేవికొన్ని – ఎన్నో వుంటాయి కదా – చెబితే వినే వాళ్లెవరులే అని వూరు కోకుండా చెప్పడమూ సంస్కారమే, సవినయంగా వినడం కూడా అంతే కదా'' అంది అవనిజ.

నవ్వుని నవ్వు అభినందించుకున్నాయి!

***

లేకిరణాల వెలుగులో వికసించిన సరోజం ఆనంద రాగాలు పలుకుతున్నట్లుగా వుంది అవనిజ మనసు. ఎందుకంటే – ఈ ఊళ్లోనే సీటొచ్చి మెడికల్ కాలేజీకి మొదటి రోజు వెళ్లింది కూతురు – తన ఆశీస్సులతో.

నీరవని పిలిచింది అవనిజ!

ప్రత్యేకమైన ఈ పిలుపుతో అవనిజ ఏం చెప్పబోతున్నదా అని నిలుచుంది నీరవ.

''యిప్పటిదాకా నీ కూతురిక్కడ వుంటే నా కూతురి చదువుకి అంతరాయం అని నీవంటే నా స్వార్థం సరేనంది. దాన్ని తీసుకురా మంచి కాలేజీలో చేర్పిద్దాం. దాని ఖర్చంతా నాదేలే'' అంది నీరవ.

''ఏ విధంగా మీకు నేను కావాల్సిన దాన్నమ్మా! ఏ రైలుకిందో పడిపోకుండా నాకింత నీడిచ్చారు చాలు. నా బరువును కూడా తెచ్చి మీ మీదెక్కడ పడేయను'' అంది నీరవ.

''నాకింకో మాట చెప్పకు కన్నపిల్లల ఎదుగుదల తల్లి కంటి దీవెనలో వుండాలి. పైగా అదిప్పుడు చిన్న పిల్లకాదు'' నిర్ణయంగా చెప్పింది అవనిజ. అందులో కొంత ఆదేశం కూడా వుంది. కాదనలేక పోయింది నీరవ.

***

''ఏమైందే – శవాలు పీకి పెట్టడం – నీ వైరాగ్యం – జీవితం మీద విరక్తి – మీ ప్రొఫెసర్ గారికి చెప్పావా లేదా'' అడిగింది అవనిజ – తను జ్వరంతో వున్న అస్వస్థత కనిపించనీయకుండా!

''మరో ఆలోచన లేకుండా మనసుని శుభ్రం చేశారే. తల పగిలే నొప్పి క్షణంలో మటుమాయమైంది. అంతా మాటలతోనే. ఎంతుందేమో ఈ మాటల్లో'' చెప్పింది కూతురు. సరదాగా కూతురి కుశలాలు తెలుసుకుంటున్న అవనిజ ఒక్కసారిగా వళ్లు విరిగినట్లు వెనక్కి వాలింది!

'అమ్మా' కేక పెట్టింది కూతురు. నీరవ గాభరగా వచ్చింది. నీళ్లు చల్లి కుర్చో బెట్టారు. ఉన్న పళాన యింత జ్వరం వచ్చిందేంటో అనుకున్నారు. డాక్టర్ని పిలిచారు. ఏవో పరీక్షలు చేయాలన్నారు. కనీసం వారం రోజులు మంచం మీదే వుండాలన్నాడు డాక్టరు.

***

తుఫాను బాధితుల క్యాంపులతో నర్సులు వచ్చే వీలు లేదు. యింకో మనిషి దొరికేట్లు లేదు. భర్తకెవరు సేవలు చేయాలి. తనకెవరు. కూతురు కాలేజీకి దూరమయ్యేట్లు లేదు.

''ఎందుకమ్మా అంత ఆందోళన పడతారు నేనున్నానుగా'' అంది నీరవ.

''ఏమిటి నువ్వా. నాకు సరే. ఆయనకు నువ్వా పనులు చేస్తావా'' నవ్వినా, ఏడ్చినా కాదు యిక్కడ ఆశ్చర్యంతో అవనిజ కళ్లలో నీళ్లు తిరిగాయి.

''మనిషికి మనిషి కాకపోతే యింకెవరమ్మా'' అంది నీరవ.

తనే నీరవ స్థానంలో వుంటే పని మానేసి పరాదరయ్యేది. అదేమాట నీరవతో అంది అవనిజ.

***

అవనిజ అనారోగ్యం విని పలకరించడానికి వచ్చింది శ్రీలలితాంబ వస్తూ ఓ వార్త తెచ్చింది – పాణి ఆఫీసు మేనేజరుతో మాట్లాడి వచ్చానని – సుప్రజారామ్‌కి జరిగిన ప్రమాదం కేసుని తిరగతోడే ఏర్పాటు చేశానని చెప్పింది.

''జరగాల్సిన నష్టం జరిగింది. యిప్పుడదంతా ఎందుకు చెప్పండి'' అంది అవనిజ.

''ఆ కేసుకి వెంటనే బలం రావడానికి కారణం ధవళకి పాణికి మధ్య గొడవ రావడమే. ధవళని బాగా తన్నాడట'' చెప్పింది లలితాంబ.

''నాకేం అర్థం కావట్లేదు! ఆయనకి రెండు ఆపరేషన్లేవో చేస్తే కోలుకునే అవకాశం ఎక్కువుందని డాక్టర్లంటున్నారు. ఆ సంతోషంలో నేనుంటే ఈ కేసులు గీసులు నాకెందుకు చెప్పండి'' అంది అవనిజ.

''రెండ్రోజులాగితే నీకే తెలుస్తుందిలే'' అని వెళ్లింది లలితాంబ.

***

అవనిజ కూతురితో ప్రొఫెసర్ మాట్లాడుతున్నాడు.

''నిన్ను ఓదార్చడానికి నా దగ్గర మాటల్లేవు. లేవు గదాని నీ ముందు ఓ మునిలా నేనుండ లేను. మీ నాన్నకు ఏ భయమూ లేదు. పూర్తిగా కోలుకుని మామూలు మనిషి అవుతాడు...'' చెబుతూ ఆగాడు ప్రొఫెసర్. అవనిజకు క్యాన్సర్ నిర్ధారణ అయిన సంగతి యిద్దరికే తెలుసు!

''ఆ విషయం అప్పుడే నాన్నకు చెప్పకు. అమ్మకూ చెప్పకు అదే మన యిప్పటి ధర్మం – ఎంతో కాలం దాచిపెట్టలేం అది వేరే సంగతి'' గుండె బరువు నిశ్వాసలో వదులుతూ.

***

చికిత్స!!! అనారోగ్యం అభిషేకించగా కరిగిపోయిన అందం మిగిల్చిన విహీనంలో వుంది అవనిజ! చదువై పోయిందని ఒకళ్లూ, పెళ్లి కుదిరిందని ఒకళ్లూ, ఎక్కడో ఉద్యోగం వచ్చిందని ఒకళ్లూ వెళ్లి పోయారు. కొత్తవాళ్లు రావడం లేదు. నిహతి గతిలో నిష్పత్తి శూన్యానికి చేరుతున్న తన రోగానికి వైద్యంలా నీరవ తనతోనే వుంది – తనుపోతే తనూ పోతుందనే అభిమానంతో ఆరాధనతో!

''సుప్రజారామ్‌ని హత్యచేయడానికే ప్రమాదం సృష్టించానని ఒప్పుకున్న పాణి'' – పేపర్లో వార్తను ఆనందంగా అవనిజకు చూపించడానికి వచ్చింది నీరవ! తల్లితో మాట్లాడుతున్న – అవనిజ కూతుర్ని – చూసి ఆగింది.

''అమ్మా! నీవడిగిన డాక్టరు డిగ్రీ తెచ్చుకున్నాను. నీవు నాకు చెప్పని నీకోరిక – నేను సివిల్స్ రాశాను. పాసయ్యాను. యింకొన్ని రోజుల్లో కలక్టరు నవుతాను'' – తల్లికి చెప్పింది కూతురు. పుత్రికోత్సాహం తల్లికీ!

అపస్మారకంగా వున్న అవనిజ కళ్లలోంచి నీటి బొట్లు రాలి ఆగిపోయాయి!

కూతురి కళ్లలో నీళ్లు వరదలై పారుతున్నాయి!

★

రాంపా
9849464672